సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం : 20 : మార్చి : 2024



ఆటోలు ఢీ.. ఆరుగురికి గాయాలు


జంగారెడ్డిగూడెంలో రెండు ఆటోలు ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి.

8లో ▸



రోగులకు ఆర్థిక ఆసరా

వైఎస్ జగన్ ప్రభుత్వం అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పేదలకు పింఛన్లు ఇస్తూ వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడుతోంది. 8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహరి గురువారం (ఉదయం)
భీమవరం	6.21	4.49
ఏలూరు	6.22	4.45

న్యూస్‌రీల్

ఎన్నికల నియమావళి అమలుపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలుకు సంబంధించి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎలాంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించ వద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ఆదిత్య ప్రవీణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రబీలో సాగునీటికి ఇబ్బంది లేదు

ఏలూరు(మెట్రో): గోదావరి డెల్టా పరిధిలో రబీ సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేదని గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నీటి లభ్యత ప్రస్తుతం సమృద్ధిగా ఉందని చెప్పారు. సాగు, తాగునీటికి ఇబ్బంది ఏర్పడితే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ధవళేశ్వరం ఫోన్ నెం. 9490741146, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్, ఏలూరు ఫోన్ నెంబర్ 9701375830, చీఫ్ ఇంజినీర్ ఫోన్ నెంబర్ 9652536333లో సంప్రదించాలన్నారు.

ఉద్యోగులంతా సమైక్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

ఏలూరు (టూటౌన్): ఉద్యోగులంతా సమైక్యంగా పనిచేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పటిష్టానికి కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గొంతి ఆస్కరరావు పిలుపునిచ్చారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని డాక్టర్స్ బిల్డింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సూర్యనారాయణ, ఆస్కరరావులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉండి వారి సమస్యలన్నింటినీ పరిశీలించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. సంఘం పటిష్టతకు తగు సూచనలు, సలహాలు తీసుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని సచివాలయ ఆరోగ్య కార్యకర్తలను గ్రేడ్-2 చేయాలని, మిగిలిపోయిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎస్ఎస్‌వి రామకృష్ణ, జె.గోవిందరావు, రాష్ట్ర కార్యదర్శి రమేష్, వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు రాంబాబు తదితరులు మాట్లాడారు.

దూరవిద్య ఇంటర్ పరీక్షలకు 680 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సుకు సంబంధించి పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 9 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 302 మందికి 278 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. వాణిజ్య శాస్త్రం పరీక్షకు 443 మందికి 402 మంది హాజరుకాగా 41 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం తెలిపారు. జిల్లా స్థాయి పరిశీలకులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, హైపవర్ కమిటీ కేంద్రాలను తనిఖీ చేసింది.

మహిళలకు కూటమి మొండిచేయి

- ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఒక్క సీటూ కేటాయించని టీడీపీ, జనసేన, బీజేపీ
- మాజీ మంత్రి పీతల, మాజీ ఎంపీ తోటకి భంగపాటు
- అధికార వైఎస్సార్‌సీపీలో మూడు స్థానాల కేటాయింపు
- నర్సాపురం లోక్‌సభకు ఉమాబాల, గోపాలపురం, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థులుగా వనిత, రాజ్యలక్ష్మి
- కూటమి తీరుపై మహిళల్లో తీవ్ర అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సీట్ల కేటాయింపుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మహిళలకు మొండిచేయి చూపింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు ఉంటే కనీసం ఒక్క టికెట్ కూడా కేటాయించపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ కేటాయింపు చూస్తుంటే ఆ పార్టీల్లో మహిళలకు ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందని, మహిళా సాధికారతకు ఇస్తున్న విలువేంటో తెలుస్తుందని ఆ పార్టీల మహిళా నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార వైఎస్సార్‌సీపీ ఈసారి ముగ్గురు మహిళలకు అవకాశం కల్పించింది.

మాటలే తప్ప సీట్లు లేవు

మహిళలు తమ పార్టీకి వెన్నుముక అని పదే పదే చెప్పే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు.. ఆ పార్టీలో పలువురు మహిళా నాయకులు ఉన్నా వారందరినీ పక్కనపెట్టారు. ఇక జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వీర మహిళలు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప చేతల్లో మాత్రం వారికి ఎలాంటి గౌరవం ఇవ్వడం లేదని నిరూపించుకున్నారు. జిల్లాలో పశ్చిమగోదావరి టీడీపీ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి భీమవరంలో క్రియాశీలకంగా ఉంటూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్నారు. టికెట్ ఆశతో గత మూడున్నరేళ్ల నియోజకవర్గంలో పనిచేశారు. ఏడాది క్రితమే టికెట్ లేదని తేల్చి చెప్పడంతో చేసేదేమి లేక మౌనంగా ఉండిపోయారు. మాజీ మంత్రి పీతల సుజాతను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. పెత్తందారుల పార్టీ కొందరి మాటలు నమ్మి తనను రాజకీయంగా సమాధి చేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని మూడు రిజర్వు స్థానాలు టీడీపీ మాదిగ సామాజిక వర్గానికి కేటాయించింది. ఒక్కటైనా మాల సామాజిక వర్గానికి ఇస్తే తనకు అవకాశం దక్కుతుందని సుజాత ఎదురుచూసి భంగపడ్డారు. బీజేపీలో ఉంగుటూరు టికెట్ ఆశించి శరణాల మాలతీరాణి, జనసేన దెందులూరు టికెట్ ఆశించి ఘంటసాల వెంకటలక్ష్మిలు తమను పరిగణనలోకి తీసుకోకపోవడంతో చేసేదేమి లేక మౌనంగా ఉండిపోయారు.

వైఎస్సార్‌సీపీలో మూడు స్థానాలు

అధికార వైఎస్సార్‌సీపీలో మహిళలకు ఈ సారి అగ్రపీఠం దక్కింది. పార్టీ ఆవిర్భావం అనంతరం మొదటిసారిగా జిల్లాలో మూడు స్థానాలు మహిళలకు కేటాయించారు. నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా బీసీ శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన గుడూరి ఉమబాలను ఖరారు చేశారు. ఆమెకు రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ పార్లమెంట్ సీటు వస్తుందని ఎవరూ ఊహించలేదు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుండటం, సామాజిక సమీకరణాల దృష్ట్యా ఉమబాలకు అవకాశం దక్కింది. గోపాలపురం నియోజకవర్గం నుంచి హోం మంత్రి తానేటి వనితకు అవకాశం దక్కింది. గతంలో వనిత ఇక్కడి నుంచి అసెంబ్లీకి గెలుపొందారు. పోలవరంలో మొదటి సారి మహిళకు అవకాశం దక్కింది. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణి తెల్లం రాజ్యలక్ష్మి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు.



గూడూరి ఉమ బాల, నర్సాపురం ఎంపీ అభ్యర్థి



తానేటి వనిత, గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి



తెల్లం రాజ్యలక్ష్మి, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి

జిల్లా నుంచి ఇద్దరు మహిళా మంత్రులు

పశ్చిమలో ప్రతిసారి మహిళా అభ్యర్థులు గెలుపొందుతూనే ఉన్నారు. 2004లో ఆచంట నుంచి పీతల సుజాత, గోపాలపురం నుంచి మద్దాల సునీత గెలుపొందగా, 2009లో గోపాలపురం నుంచి తానేటి వనిత, పాలకొల్లు నుంచి బండారు ఉషారాణి గెలుపొందారు. 2014లో చింతలపూడి నుంచి సుజాత, 2019లో కొవ్వూరు నుంచి వనిత గెలుపొందారు. తానేటి వనిత, పీతల సుజాత మంత్రులుగా పనిచేశారు.

ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): వివాదాలకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఆర్వోలు, మండల అధికారులు, టీంలతో కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి మరింత కఠినంగా అమలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ చర్యలు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికలు కమిషన్ నిషేధించిన ప్రచారం, ఫొటోలు, బ్యానర్లు, కటౌట్లు వెంటనే తొలగించి సంబంధిత నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాల విషయమై జిల్లాలోని ప్రింటర్స్ యాజమాన్యాలతో సంబంధిత రిటర్నింగ్ అధికారులు సమావేశం నిర్వహించి మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రచురించిన కరపత్రాలు, ప్రచార సామగ్రిపై తప్పనిసరిగా ప్రింటింగు ప్రెస్ పేరు, ప్రతుల సంఖ్య ఉండాలని లేదంటే వాటిని గుర్తించి సంబంధిత ప్రింటర్స్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జాయింటు కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కడదాం

- చీఫ్ విప్ ముదునూరి, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల
- గొందిలో ఎన్నికల ప్రచారం ప్రారంభం



గొందిలో ఎన్నికల ప్రచారంలో చీఫ్ విప్, ఎమ్మెల్యే ప్రసాదరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలంతా ఆశీస్సులు అందించాలని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం గొంది గ్రామం నుంచి ఎన్నికల ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు. తొలుత ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, పార్టీ యువనేత ముదునూరి శ్రీకృష్ణంరాజుతో కలసి నరసాపురం పట్టణంలోని ప్రసాదరాజు నివాసం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తూ గొందికి చేరుకున్నారు. గ్రామంలోని వినాయకుడి గుడిలో దర్శనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చర్చిలో ప్రార్థన అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. వారికి హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు గడప గడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచార కరపత్రాలను అందజేశారు. ప్రతీ ఓటరు ఫ్యాన్ గుర్తుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు ఓట్లు వేయాలన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఐదేళ్లలో సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుంచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో నూటికి 98 శాతం హామీలను అమలు చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలో కరోనాతో ఇబ్బందులను ఎదుర్కొన్నా అభివృద్ధి, సంక్షేమాన్ని ఎక్కడా విస్మరించలేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఉమాబాల మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలనను అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డి దేనని సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసిన ఘనత కూడా ఆయనదేనన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పాలన అందించిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున తరలి వచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులు జై జగన్, జై ముదునూరి, జై గూడూరి అంటూ నినాదాలు చేశారు. ప్రచారంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, బాపూజీ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, దొంగ మురళీకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోని, యర్రంశెట్టి శ్రీనివాసరావు, మద్దాల అంజిబాబు, యర్రంశెట్టి నరేష్, కౌరు ధర్మారావు, అంగాడి ధర్మారావు, అంగాడి నాగేశ్వరరావు, పెదపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో నాయీ బ్రాహ్మణులకు గౌరవం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి హయాంలోనే నాయీ బ్రాహ్మణులకు గౌరవం దక్కిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక నాయీ బ్రాహ్మణుల సంఘ భవనంలో మంగళవారం సమావేశంలో మంత్రి కొట్టు మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు నాయీ బ్రాహ్మణులను దారుణంగా అవమానించాడని గుర్తుచేశారు. దేవాలయాల్లో విధులు నిర్వహించే నాయీ బ్రాహ్మణులకు రూ. 20 వేలు ఆదాయం వచ్చేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. టీటీడీతో పాటు రాష్ట్రంలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని అన్ని ఆలయాల పాలక వర్గాల్లో కచ్చితంగా ఒక నాయీ బ్రాహ్మణుడు ఉండాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకొని అమలు చేశారన్నారు. సెలూన్లకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయా సామాజిక వర్గాలకు మేలు చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలని, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీటీడి బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య మాట్లాడుతూ సంఘం తరపున జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం అంటూ ప్రచారయాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండ మల్లు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

తాడేపల్లిగూడెం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా పట్నాల గణపతి, పట్నాల శంకరరావు, బండారు పెద్దిరాజు, అధ్యక్షుడిగా తగరంపూడి మురళీకృష్ణ, కార్యదర్శిగా ఆచంట తిరుమలరావు, కోశాధికారిగా విప్పాడ భానుప్రకాష్, ఉపాధ్యక్షులుగా మల్లువలస శివప్రసాద్, పసుమర్తి శ్రీను, తీడా అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లువలస చక్రవర్తి, సహాయ కార్యదర్శులుగా పాట్నూరి రాజేష్, తగరంపూడి మల్లిక్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అయినవిల్లి కృష్ణ, పట్నాల మణికంఠ, ప్రచార కార్యదర్శులుగా పాతర్లపల్లి రాజు, వెంకట్, కిరణ్, ప్రసాద్ ఎంపికయ్యారు.

ఇంటి నుంచే ఓటు

- 85 ఏళ్లు పైబడ్డ వృద్ధులు, వైకల్యంతో నడవలేని వారికి అవకాశం
- పోలింగ్ శాతం పెంచేలా కొత్త విధానం
- మొబైల్ వాహనం సాయంతో ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగం
- ఇప్పటికే మొదలైన దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో దివ్యాంగ ఓటర్లు 19,215 మంది
- 85 ఏళ్లు పైబడిన వారు 7,826 మంది



వీరవాసరంలో పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని మోసుకువస్తున్న దృశ్యం (ఫైల్)



చినకాపవరంలో వృద్ధురాలిని వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, భీమవరం: 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు ఓటు హక్కు సులభంగా వినియోగించుకునేలా ఎన్నికల సంఘం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. వారి వద్దకే మొబైల్ వాహనం పంపి ఓటు వేసేలా సౌకర్యం కల్పిస్తోంది. ఈ విధానంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా చూడడంతో పాటు, ఓటింగ్ శాతం కూడా పెంచవచ్చని యోచిస్తోంది. అందుకోసం ఇప్పటికే జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకునేలా చూడడం ఈసీ లక్ష్యం. 18 ఏళ్లు నిండిన వారందరికి ఓటు హక్కు కల్పించే నిమిత్తం స్పెషల్ సమ్మరి రివిజన్‌ను పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. ఓటుహక్కు ప్రాధాన్యతను వివరిస్తూ సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమం నిర్వహిస్తోంది. పోలింగ్ శాతం పెంచేలా ప్రస్తుత ఎన్నికల నుంచి హోమ్ ఓటింగ్ (ఇంటి నుంచే ఓటు వేయడం) విధానాన్ని అమలుచేస్తుంది.

తీరనున్న వెతలు

ఎన్నికల సమయంలో వృద్ధులు, దివ్యాంగులు, ఆనారోగ్యంతో బాధపడుతున్న వారిని కుటుంబ సభ్యులు మోసుకుంటూ పోలింగ్ కేంద్రాలకు తీసుకువస్తుంటారు. కేంద్రాల వద్ద వీల్‌చైర్స్ సదుపాయం కల్పించినప్పటికీ ఇంటి నుంచి కేంద్రానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తీసుకురాలేని పరిస్థితుల్లో చాలామంది ఓటుహక్కు వినియోగించుకోలేకపోతున్నారు. పోలింగ్ శాతం పెంచే లక్ష్యంతో నడవలేని స్థితిలో ఉన్న వారు ఇంటి నుంచి ఓటు వేసేందుకు ఈసీ చర్యలు చేపట్టడంతో వారి వెతలు తీరనున్నాయి.

85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న వారు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు నూతన మొబైల్ ఓటింగ్ వాహనం వారికి ఇంటి వద్దకే వెళ్తుంది. పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే హోం ఓటింగ్‌కు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.

ముందుగానే బీఎల్‌ఓలు గుర్తించి..

ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు 7,826 మంది ఉండగా వీరిలో పురుషులు 3,180 మంది, మహిళలు 4,646 మంది ఉన్నారు. దివ్యాంగులు 19,215 మంది ఉండగా వీరిలో పురుషులు 11,413, మహిళలు 7,801, థర్డ్‌జండర్ ఒకరు ఉన్నారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం నడవలేని స్థితిలో కేంద్రానికి రాలేని ఓటర్లను బీఎల్‌ఓలు గుర్తించి ఫారం-12డి ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ)కి దరఖాస్తు చేయిస్తున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం హోం ఓటింగ్‌కు అర్హులైన వారి జాబితాను ఈఆర్ స్థాయిలో రూపొందిస్తారు. ఏ రోజు ఓటు వేయాలో ముందుగానే వారికి అధికారులు సమాచారం ఇస్తారు. బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాటు చేస్తారు. ఆ ఓటును సీల్ చేసిన అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు. ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతానికి అధికార యంత్రాంగం పారదర్శకంగా ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లాలో ఓటర్ల వివరాలు

పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
1,463	14,61,230
పురుషులు	మహిళలు
7,16,301	7,44,853
ఇతరులు : 76	

జిల్లాలో వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లు

నియోజకవర్గం	85 ఏళ్లు పైబడిన వారు	దివ్యాంగులు
ఆచంట	959	2,671
పాలకొల్లు	1,119	2.166
నరసాపురం	847	2,214
భీమవరం	1,288	2,674
ఉండి	1,338	3,046
తణుకు	1,160	3,107
తాడేపల్లిగూడెం	1,115	3,337

వృద్ధులకు ప్రయోజనకరం



ఇంటి వద్దే ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ మంచి నిర్ణయం తీసుకుంది. నడవలేని స్థితిలో పోలింగ్ బూత్‌కు రాలేక చాలామంది ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. అలాంటి వారికి నూతన విధానం ఎంతో ప్రయోజనకరం.

– చిటికన వెంకన్న, సీనియర్ సిటిజన్, పెదమిరం, కాళ్ల మండలం

ఈ విధానం అభినందనీయం



ప్రమాదం వల్ల నాకు ఒక కాలు తొలగించారు. ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం నాలాంటి వారికి అవసరం. దీనివల్ల పోలింగ్ శాతం పెరుగుతుంది. వైకల్యం, వృద్ధాప్య కారణంగానో ఇబ్బంది పడేవారికి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం అభినందనీయం.

– పల్లి ఇశ్రాయేలు, గుమ్మలూరు, పోడూరు మండలం

ఎన్నికల ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నివేదికల సమర్పణ, సి విజిల్, సువిధ యాప్, కంట్రోల్ రూమ్ నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రవర్తన నియమావళి, వ్యయ ఉల్లంఘనలపై సి విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదుపై తక్షణం స్పందించాలన్నారు. షిఫ్టుల వారిగా 24 గంటలు అత్యంత బాధ్యతతో పని చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూంపై ఎలాంటి ఫిర్యాదు రాకుండా అధికారులు, టెక్నికల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టరు అన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాధుర్, సంబంధిత జిల్లా అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు ఎం.సన్యాసి రావు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమ శకం





పింఛనే నా జీవితానికి ఆధారం

నా భర్త ఇటీవల మరణించాడు. ఇప్పుడు నా వయస్సు 54 సంవత్సరాలు. మండవల్లిలో నివాసం ఉంటున్నాను. నాకు బిడ్డలు లేరు. భర్త మరణంతో ఒంటరి జీవితం గడపుతున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొడుకులా నన్ను ఆదుకున్నాడు. ప్రతి నెలా రూ.3 వేలు పింఛను సొమ్మును వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తోంది. వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 అందిస్తున్నారు. అదేవిధంగా వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.5 వేలు అందుకున్నాను. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు సైతం నాకు చేశారు. ప్రభుత్వం నాకు అండ ఉందనే ధీమాతో జీవనం సాగిస్తున్నాను.

– గండెపూడి జసింత, మండవల్లి



జగనన్న ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంది

మాది మండవల్లి గ్రామం. నాకు ఇద్దరు కుమార్తెలు. నా వయస్సు 32 సంవత్సరాలు. గత ప్రభుత్వం మాలాంటి వారికి ఎలాంటి సాయం అందివ్వలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక మా బతుకులు మారాయి. అమ్మ ఒడి పథకం ద్వారా నా చిన్న కుమార్తెకు ఏడాదికి రూ.15 వేలు బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. పెద్ద కుమార్తెకు జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.22 వేలు, జగనన్న వసతి దీవెన కింద రూ.8 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.5 వేలు అందాయి. మా కుటుంబం ఏ చీకూచింతా లేకుండా ముందుకు సాగుతోంది. మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– దాకరపు కస్తూరి, మండవల్లి



ఆర్థిక గండాల నుంచి గట్టెక్కాం

మాది అత్యంత పేద కుటుంబం. అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొనేవాళ్లం. గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మాకు ఎలాంటి మేలు జరగలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. నాకు వితంతు పింఛను మంజూరైంది. నా కుమార్తెకు జగనన్న కాలనీలో స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. నా మనుమడు, మనువరాలికి విద్యాదీవెన పథకం కింద ప్రతి ఏటా డబ్బులు జమచేస్తున్నారు. నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఇప్పటివరకు రూ.75 వేలు లబ్ధి చేకూరింది. ఈ విధంగా జగనన్న దయతో మా కుటుంబం ఆర్థిక గండాల నుంచి గట్టెక్కింది.

– గాజులపల్లి స్వామ్రాజ్యం, లింగాల, ముదినేపల్లి మండలం

క్లుప్తంగా

చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయండి



లోసరి చెక్‌పోస్టు వద్ద పోలీసులకు సూచనలిస్తున్న జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం అర్బన్: జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య సిబ్బందిని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా లోసరిలో జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జేసీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలను వాహనాలలో తరలించకుండా కట్టడి చేయాలన్నారు. చెక్‌పోస్టు వద్ద భద్రత చర్యలు చేపట్టాలని, ప్రతి వాహనాన్ని సమగ్రంగా తనిఖీ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆయన వెంట పలు శాఖల అధికారులు ఉన్నారు.

తనిఖీల్లో రూ.1.62 లక్షల నగదు స్వాధీనం



వీరవాసరంలో స్వాధీనం చేసుకున్న నగదుపై విచారణ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: ఎన్నికల్లో విధుల్లో భాగంగా వీరవాసరం ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో మంగళవారం రూ.1.62 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ సుశీలదేవి చెప్పారు. చించినాడ గ్రామానికి చెందిన కండవల్లి బిందు, కండవల్లి సునీల్ కారులో ఈ నగదును తీసుకుని వెళుతున్నారు. ఈ నగదుకు సంబంధించి ఎటువంటి బిల్లులు చూపకపోవడంతో ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీం) నగదును స్వాధీనం చేసుకుందన్నారు. పంచనామా నిర్వహించి నగదును జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ప్రజలు రూ.50 వేలకు మించి నగదును వెంట తీసుకెళ్లరాదన్నారు. స్క్వాడ్ బృందంలో మండల స్థాయి అధికారులు కె.నాగేశ్వరరావు, వీరభద్రరావు, సురేష్ మూర్తి ఉన్నారు.

Indian Bank ఇండియన్‌బ్యాంక్ పోడూరు బ్రాంచ్
మెయిన్ రోడ్, పోడూరు, ప.గో.జిల్లా
సవరణ
తేది.07-03-2024న దినపత్రికలలో ప్రచురించబడిన అనుబంధం-4 (రూల్ 8(1)) ప్రకారం స్వాధీనత ప్రకటనలో బకాయి మొత్తం రూ.73,04,000/- కు బదులు రూ.70,70,264/- గా చదువుకోగలరు మరియు ఆస్తి నందు ఐటమ్ నెం.1 మరియు 2 లను కూడా ఎకరా 0.14 ¾ సెంట్లు మరియు ఎకరా 0.14 ¾ సెంట్లు విస్తీర్ణంగా దయచేసి చదువుకోగలరు.
ప్రదేశం : పోడూరు సం/-అధీకృత అధికారి
తేది : 18-03-2024 ఇండియన్ బ్యాంక్

రోగులకు ఆర్థిక ఆసరా

- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆరోగ్య భరోసా
- రోగులు కోలుకునేలా పింఛను మంజూరు
- ఏలూరు జిల్లాలో 2,346 మందికి రూ.1.57 కోట్ల చొప్పన ప్రతి నెలా పంపిణీ
- చేతులెత్తి నమస్కరిస్తున్న రోగుల కుటుంబాలు

కుక్కునూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. అధికారం చేపట్టిన నాటి నుంచి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే తపనతో గత ప్రభుత్వాల హయాంలో నిర్వీర్యమైన 108, 104 సేవలను పునరుద్ధరించారు. అంతేకాక ఆరోగ్యశ్రీలో 3,257 రకాల వ్యాధులను చేర్చి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు ప్రతి పేదవాడి ఇంటి ముందుకు వైద్యాన్ని తీసుకువచ్చేలా జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను చేపట్టిన ప్రభుత్వం అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పేదలకు పింఛన్లు అందిస్తూ వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని అండగా నిలబడుతోంది. జగనన్న అధికారం చేపట్టిన తరువాత తలసేమియా, కిడ్నీ, సికిసెల్, అనీమియా వంటి అనారోగ్యాలతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రతి నెలా వ్యాధిని బట్టి రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున పింఛన్ అందిస్తూ ఆదుకుంటోంది. అలా పింఛన్ పొందిన ప్రతి నిరుపేద కుటుంబం ముఖ్యమంత్రి అందిస్తున్న సాయాన్ని కొనియాడుతూ చేతులెత్తి నమస్కరిస్తోంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న 2,346 మంది బాధితులకు ప్రతి నెలా రూ.1.57 కోట్లు ప్రభుత్వం పింఛన్ రూపంలో అందిస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతుల పేర్లు దాసరి శ్రీలక్ష్మి, దాసరి రమేష్. వీరికి ఇద్దరు సంతానం. మొదటి సంతానం ఆకాష్, రెండో సంతానం అనూష. రెక్కాడితే గాని డొక్కాడని దాసరి రమేష్ కుటుంబంలో ఇద్దరు చిన్నారులకు సికిల్‌సెల్, తలసేమియా వ్యాధి సోకడంతో వారికి వైద్యం అందించేందుకు తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడేవారు. ఇదిలా ఉండగా, వీరు జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత హెల్త్ పెన్షన్‌కు దరఖాస్తు చేయగా, ఇద్దరి పిల్లలకు రూ.10 వేల చొప్పున పింఛన్ మంజూరు చేసింది. వీరిలో మూడు సంవత్సరాల క్రితం కుమారుడు ఆకాష్ మృతి చెందగా, ప్రస్తుతం కుమార్తె అనూష ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం ఎక్కించుకుంటూ పౌష్టికాహారం తీసుకుంటోంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా, ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాస్తోంది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాతనే తమ కుమార్తె భవిష్యత్తు బాగుపడిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

జిల్లాలో పింఛను పొందుతున్న రోగుల వివరాలు	
బోధకాలు వ్యాధిగ్రస్తులు	25
కిడ్నీ బాధితులు	555
కిడ్నీ, లివర్, గుండె మార్పిడి చేసుకున్న వారు	33
పక్షవాతం, ప్రమాదాలతో మంచానికే పరిమితమైన వారు	1,309
సివియర్ హెమోఫీలియా	59
శారీరకంగా కండరాల ఎదుగుదల లేని, ప్రమాదవశాత్తు అంగవైకల్యం బారిన పడిన వారు	183
సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు	109
తలసేమియా	73

జగన్ మావయ్య ఆదుకున్నాడు



నా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. నాకు, మా అన్నయ్యకు రక్త సంబంధిత వ్యాధి ఉండటంతో మేం అనారోగ్యం పాలైనప్పుడల్లా మమ్మల్ని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి మా తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. జగన్ మామయ్య ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన అందిస్తున్న పింఛన్ సొమ్ముతో ఇప్పుడు నేను ఆరోగ్యంగా ఉన్నాను. పదో తరగతి పరీక్షలు కూడా రాస్తున్నాను.

– దాసరి అనూష, కుక్కునూరు

న్యాయం కోరుతూ వివాహిత దీక్ష



లక్కవరంలో దీక్ష చేపట్టిన దుర్గాభవానిని సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్సై సుధీర్

జంగారెడ్డిగూడెం రూరల్: తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వివాహిత మంగళవారం లక్కవరంలో దీక్ష చేపట్టింది. ఎస్సై సుధీర్‌కు బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లికి చెందిన దుర్గాభవానీకి జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన డొక్కా రామాంజనేయులతో గత ఏడాది మే 21న వివాహం జరిగింది. వివాహమైన కొన్ని నెలలకే అత్త, మామ, ఆడపడుచు, ఆమె భర్త కానిస్టేబుల్ దుర్గాభవానీపై వేధింపులకు పాల్పడటం మొదలుపెట్టారు. భర్త నుంచి ఆమెను వేరు చేసి వదిలించుకుందామనే ఉద్దేశంతో తరచూ వేధింపులకు గురిచేస్తూ అనేకసార్లు ఆమెను కొట్టారు. దీనిపై ద్వారకాతిరుమల, ఏలూరు పోలీస్‌స్టేషన్లలో బాధితురాలు ఫిర్యాదు చేయగా, అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా అనేకసార్లు జరిగింది. గత మూడు నెలలుగా భర్తతో దుర్గాభవాని కాపురం చేసుకుంటుండగా, మహాశివరాత్రి రోజున భర్తను దాచిపెట్టి తన వద్దకు రాకుండా చేస్తున్నారని ఆరోపించింది. తన భర్తను తీసుకువచ్చి అప్పగించి న్యాయం చేసే వరకు దీక్ష కొనసాగిస్తానని ఎస్సైకు తెలిపింది.



శ్రీవారి క్షేత్రంలో ఆకాశ విహంగం

శ్రీవారి కొండపై ఏర్పాటు చేసిన గరుడ పక్షి భక్తులను ఆకట్టుకుంటోంది. పలు వాహనాల విడి భాగాలతో ఆకర్షణీయంగా తయారు చేసిన ఈ గరుడ పక్షిని వరుణ్ గ్రూప్ సంస్థ దేవస్థానానికి బహూకరించింది. దీన్ని ఆలయ అధికారులు సెంట్రల్ పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. శ్రీవారికి గరుడ వాహనం ప్రీతికరమైనది కావడంతో వరుణ్ గ్రూప్ వారు దీన్ని అందజేసినట్టు ఆలయ అధికారులు చెబుతున్నారు. – ద్వారకాతిరుమల

ఆయుర్వేద ఔషధాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఔషధాలను చూపుతున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆయుర్వేద ఔషధాల నియంత్రణ చట్టం ప్రకారం అభ్యంతరకర ప్రకటనలతో మార్కెట్‌లో విక్రయిస్తున్న ఆయుర్వేద ఔషధాలను స్వాధీనం చేసుకున్నామని ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ జె బాలు చెప్పారు. ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంపీఆర్ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ హరిప్రసాద్ సమక్షంలో వెంకటాపురం పంచాయితీ పరిధిలోని వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో యూనిక్ డ్రగ్స్ ల్యాబొరేటరీస్‌కి చెందిన ఎండీ టోన్, ఎండీ స్టోన్ అనే సిరప్ బాటిల్స్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఔషధాలను ఏలూరులో కోర్టు దృష్టికి బుధవారం తీసుకువెళతామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రెండు ఆటోలు ఢీ.. కూలీలకు గాయాలు



ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన వ్యవసాయ కూలీలు



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో కూలీలకు చికిత్స అందిస్తున్న దృశ్యం

- పనులకు వెళ్లి తిరిగొస్తున్న కూలీల ఆటోను ఢీకొన్న ట్రక్కు ఆటో
- ఇద్దరు డ్రైవర్లు, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలు
- జంగారెడ్డిగూడెం హైవే పై ఘటన

జంగారెడ్డిగూడెం: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఆటోడ్రైవర్లు, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం పొంగుటూరుకు చెందిన 12 మంది మహిళా కూలీలు జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో పొగాకు పనులకు ఆటోలో వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ఆటోలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. జంగారెడ్డిగూడెం పరిధిలోని బైపాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఓ మహిళ ద్విచక్రవాహనంపై అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో కూలీలతో ఉన్న ఆటో డ్రైవర్ వాసారపు ముత్యం మహిళను తప్పించే క్రమంలో ఆటోను పక్కకు తిప్పాడు. అదే సమయంలో పైప్‌ల లోడుతో ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో డ్రైవర్ ముత్యం, నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలు కాగా, మిలిగిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108, వేరొక ఆటోలో స్థానిక ఏరియా ఆసుపత్రికి, ఆటో డ్రైవర్ ముత్యంను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కూలీలలో మర్లపూడి కళావతి, జగ్గు రమేష్‌లను మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు తరలించారు. ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

TO - LET
■ ToLet : For Students / Bachelor's Enamadala, 3km from Nuzvid on Main Road. Ph : 95158 77494 [V-2435]

PROPERTY FOR SALE
■ తాడేపల్లిగూడెం నందు 19 ఎ॥, భీమవరం నందు 2700 చ॥గ॥, 640 చ॥గ॥ ఇల్లు, 5 Flats & తణుకు నందు 1445 Sft. Flat & ఏలూరు నందు 240 చ॥గ॥ ఇల్లు అతి తక్కువ ధరకు అమ్మబడును. సం॥ : 73969 98125 [V- 6434]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2509]

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824380]

■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. సంప్రదించండి: 7015882322. [H-801690]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233894]

■ VIPల ఇళ్ళ వద్దనే ఉండి పెద్దవారిని, వృద్ధులను చూసుకొనుటకు సర్టిఫైడ్ నర్సులు, కేర్ టేకర్స్ (M/F), ఆయాలు విజయవాడకి కావలెను. మంచి జీతం + వసతి + భోజనం. ✆ 91608 35559, 98850 25559 [B-709]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7995984445 [HA-1385]

■ మదర్ థెరిసా హోం కేర్ సర్వీసెస్ Hyd లో శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవ చేయుటకు 20-40 సం॥ వయసు గల స్త్రీ/పు. కావలెను. జీ: 15000/-18000/- మరియు 2 వీలర్ డ్రైవర్స్ కావలెను. ఫోన్ 9553681000, 9553684000. [H-801497]

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

వివాహితపై లైంగిక వేధింపులు

ఆగిరిపల్లి: వివాహితను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అడవినెక్కలం గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన నల్లమోతు కిషోర్ లైంగిక కోరిక తీర్చాలని వేధించాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై సురేంద్ర కుమార్ మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న కె.అద్దయ్య

చింతలపూడి: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆంధ్ర, తెలంగాణ బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య లింగగూడెం, అల్లిపల్లి చెక్‌పోస్టులను ఆకస్మిక తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి వచ్చే వాహనాలను సిబ్బంది చేస్తున్న తనిఖీలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీల్లో అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం, నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు అమలు చేయడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనకూడదని హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గోపాలకష్ణ, ఎస్సై కుటుంబరావు ఉన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ఆగిరిపల్లి: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లికి చెందిన అంజలికి ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రగూడెంకు చెందిన ప్రత్తిపాటి రుదమ్‌కు ఆర్నెల్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.ఒక లక్ష కట్నం ఇచ్చారు. పెళ్లి తరువాత కొన్ని రోజులు బాగానే చూసుకున్నారని, తర్వాత భర్త రుదమ్, కుటుంబ సభ్యులు అదనంగా కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు భర్త, కుటుంబ సభ్యులపై ఎస్సై సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దింట్లమ్మ పెండ్లి కూతురాయెనే..



పెద్దింట్లమ్మకు పొంగళ్లు తీసుకువచ్చిన భక్తులు



కొల్లేటికోట పెద్దింట్లమ్మకు పూజలు

రేపు జలదుర్గా, గోకర్ణేశ్వరుని కల్యాణం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామివార్ల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు మంగళవారం చెప్పారు. ఉదయం జలదుర్గ అమ్మవారికి అభిషేకాలు, నూతన వస్త్రాలంకరణతో పెండ్లి కుమార్తెను చేశారు. అనంతరం అస్తమావరణ కలశ పూజ, లలిత సహస్రపుష్పాలతో కుంకుమ పూజ, పుష్పాలంకరణ, ధూపసేవ, బాలభోగం, సాయంత్రం పంచహారతులు అర్చకులు అందించారు. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా భుజబలపట్నంకు చెందిన ముదునూరి వెంకట శ్రీనివాసరాజు దంపతులు దాతలుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాలసుందరం భాగవతార్ హరికథా కాలక్షేపం, బైరవపట్నంకు చెందిన మీగడ సత్యానారాయణ ఘంటసాల గాన సుధ ఆకట్టుకుంది.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీఓ సూర్యచక్రవేణి

ఏలూరు (టూటౌన్)/పెదవేగి: పెదవేగి మండలం వేగివాడలో ఓ బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వేగివాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తొమ్మిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల వయస్సున్న బాలికను ఇచ్చి రహస్యంగా వివాహం చేస్తున్నారనే సమాచారం మేరకు బాల్యవివాహ నిరోధక అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు, సచివాలయం మహిళా కార్యదర్శి వివాహం జరిగే ప్రదేశానికి వెళ్లి వివాహాన్ని నిలుపుదల చేశారు. బాలిక, బాలిక తల్లిదండ్రులను అధికారులు ఏలూరు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయానికి తరలించి డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి ఆధ్వర్యంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. బాలికను సంరక్షణ నిమిత్తం వసతి గృహానికి తరలించారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం బాల్య వివాహం చేసుకుంటే రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. బాల్య వివాహాలపై సమాచారాన్ని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని కో-ఆర్డినేటర్ వైవీ రాజు కోరారు. పెదపాడు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ మేరీ జయమ్మ, మహిళా కార్యదర్శి కృష్ణ కుమారి, భీమడోలు సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

భీమవరం: భీమవరం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. రైల్వే ఎస్సై పీటీవీ రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెన్నాడ రైల్వే యార్డ్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో 40 ఏళ్ల వయస్సున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడన్నారు. మృతదేహంపై పసుపు రంగుపై నీలం, తెలుపు రంగు నిలువు, అడ్డచారల పొడుగు చేతుల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఎడమ తొడపై నల్లని పుట్టుమచ్చ, రెండు కాళ్లపై మోకాళ్ల నుంచి కింద వరకు బొల్లి మచ్చలు ఉన్నాయన్నారు. అలాగే మరో ఘటనలో లక్ష్మీనారాయణపురం హాల్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో సుమారు 45 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని మహిళ మృతి చెందిందన్నారు. మృతురాలు నీలం రంగుపై తెలుపు పూల డిజైన్ చీర, గులాబీ రంగు జాకెట్ ధరించి, మెడలో ఒంటిపేట పసుపు తాడు, నీలం రంగు లంగా ధరించి ఉందన్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించామన్నారు. మృతదేహాల ఆచూకీ తెలిసిన వారు 70939 39777 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై కోరారు. ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి వారి ఆలయం (పెద్ద శివాలయం)లో మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జానపద స్వరగానం మహోత్సవానికి ఆహ్వానం

తణుకు: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న తిరుపతిలో జరిగే జానపద స్వరగానం మహోత్సవానికి తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ నుంచి తనకు ఆహ్వానం అందినట్లు ప్రసాద్ వెల్లడించారు.

వేల్పూరు పీహెచ్‌సీకి జాతీయ స్థాయిలో గుర్తింపు

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ఎం.ఆర్.కిషోర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ నాణ్యత, ప్రమాణాల సంస్థ జనవరి, ఫిబ్రవరి నెలల్లో చేపట్టిన నాణ్యత, ప్రమాణాల నాణ్యత గణనలో రాష్ట్రంలో 7 పీహెచ్‌సీలు 80శాతంపై స్థాయిని సాధించగా వాటిలో మన జిల్లాలోని వేల్పూరు పీహెచ్‌సీ 86శాతం గణన సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ పరికరాలతో వృత్తిని కొనసాగిస్తున్న వారందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ కోరారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్‌బాడీ సమావేశం పట్టణంలో యూనియన్ అధ్యక్షుడు బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. దాన వర ప్రసాద్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వృత్తిదారులకు ప్రభుత్వాలు నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, జమ్మితార చంద్రశేఖర్, దేవాబత్తుల రాము, పాండురంగారావు, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సేంద్రియ ఉత్పత్తులు మేలు

పెనుగొండ: సంపూర్ణమైన ఆరోగ్యానికి సేంద్రియ వ్యవసాయంతో వచ్చే ఉత్పత్తులు మేలు చేస్తాయని నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ కృపావతి అన్నారు. మంగళవారం చినమల్లంలోని రైతు మిద్దే శ్రీనివాస్ పొలంలో వేసిన మిర్చిపంటను పరిశీలించి, సేంద్రియ వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మిర్చి పంటలో ప్రధానంగా తామర పురుగు ఎక్కువగా గమనించామని, దీని నివారణకు ఉల్లి కషాయం పిచికారీ చేయాలన్నారు. మిర్చి పంటలో అంతర పంటగా నవధాన్యాలు సాగు చేయవచ్చన్నారు. దీని వల్ల అధిక రాబడి ఉంటుందన్నారు. సామూహికంగా జీవామృతం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి బి.ఆదినారాయణ, ఐసీఆర్‌పీ ఉప్పలపాటి శ్రీదేవి, కుడుపూడి నరేష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఉండి: మండలంలో ఎన్నికల నియమావళిని అధికారులు కఠినంగా అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలోను అన్ని పార్టీలకు సంబంధించి బ్యానర్‌లను, వాల్ పోస్టర్‌లను ఇప్పటికే తొలగించారు. అంతే కాకుండా ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా మంగళవారం ఉండి ఆకివీడు జాతీయ రహదారిపై పోలీసులు, అధికారులు ఉమ్మడిగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎవరైనా అధిక మొత్తంలో నగదు కలిగి ఉండే దానిని సీజ్ చేస్తామని సరైన ఆధారాలు కలిగి ఉండే దానిని వారికి అప్పగించేస్తామని అధికారులు తెలిపారు. ప్రతి తనిఖీని ఎప్పటికప్పుడు వీడియో షూటింగ్ ద్వారా రికార్డు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వీంద్ర, ఈఓపీఆర్‌డీ ఎం.రామకృష్ణారెడ్డి, ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోషణ సంపూర్ణం.. చక్కని ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు
- చిరుధాన్యాల ఉపయోగాలపై అవగాహన



వరిఘేడులో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



అత్తిలి మండలం బల్లిపాడులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఎం. శ్రీదేవి

అత్తిలి: రేపటి తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తోంది. దానిలో భాగంగా ఈనెల 9 నుంచి 23 తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పోషకాహారం, వాటి ఉపయోగాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిప్తిస్తున్నారు. తక్కువ ఖర్చుతో పోషకాహారాన్ని తయారు చేసుకోవడాన్ని తెలియజేస్తున్నారు. తణుకు సీడీపీఓ పరిధిలో గల అత్తిలి, ఇరగవరం, తణుకు రూరల్ మండలాల్లో 228 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 1,133 మంది గర్భిణులు, 1,331 మంది బాలింతలు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఈనెల 9 నుంచి 23వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులు, వారి తల్లులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం కలిగే ప్రయోజనాలను వివరిస్తూ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. చిరు ధాన్యాలైన రాగులు, జొన్నలు, గంటి, కొర్రలు, గోధుమలలో పోషకాలు అధికంగా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఆకు కూరలు ఎక్కువగా తినడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని, ఇలా చిరుధాన్యాలు, ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. సంపూర్ణ పోషణ భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పోషకాహారంతో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తోంది. ఈ పక్షోత్సవంలో ఇప్పటి వరకు 60 శాతం మందికి వీటిని పంపిణీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో రెండున్నర కిలోల చోడిపిండి, రెండున్నర కిలోల అటుకులు, పావుకిలో బెల్లం, పావుకిలో వేరుశనగ అచ్చు, పావుకిలో ఖర్జూరం, 25 కోడిగుడ్లు, 5లీటర్ల పాలు ఉంటాయి. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు నెలకు 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, రెండున్నర కిలోల బాలామృతం అందజేస్తున్నారు.

క్రమం తప్పకుండా

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నారు. చిన్నారులకు బాలమృతం, గుడ్లు, పాలు, గర్భిణులు, బాలింతలకు మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో నూనె అందజేస్తున్నారు. వీటిని ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారాల్లో పంపిణీ చేస్తున్నాం.

– పి ప్రమోదిని, సీడీపీఓ, తణుకు

వసతుల కల్పన



రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తోంది. గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్ని వసతులు సమకూరాయి.

– గంటావిజేత, సర్పంచ్, అత్తిలి

ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలి

తణుకు టౌన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున అన్ని రాజకీయ పార్టీలు, ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తణుకు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీవీ రమణ కోరారు. మంగళవారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో 24 గంటలు పని చేసే కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికలకు సంబంధించి మీడియా పాటించాల్సిన కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి మీడియా సభ్యులకు వివరించారు. ఈసమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బీఎం ముక్తేశ్వరరావు, టీపీవో టీఎస్ మణి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, డీటీ కేయూవీ భాస్కర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్షల్లో భాగంగా తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడులో 10 సెంటర్‌ల్లో రెండో రోజు మంగళవారం సెకండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. రూరల్ మండలంలోని 5 సెంటర్‌లకు గాను 874 మంది విద్యార్థులకు గాను 803 మంది హాజరైయారు. 71 మంది హాజరుకాలేదు. అదే విధంగా పెంటపాడులో 5 సెంటర్‌లకు గాను 736 మందికి గాను 666 మంది పరీక్షలు రాశారు. 70 మంది హాజరుకాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీవైఈఓ కార్యాలయం సిబ్బంది తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పాలన



తణుకులో సుద్దుల పాండును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కారుమూరి తదితరులు

తణుకు అర్బన్: ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు తిరిగి వైఎస్సార్ సీపీలోకి వచ్చారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసిన పాండు తిరిగి పార్టీలోకి వస్తున్నట్లు చెప్పగా మంత్రి కారుమూరి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ప్రతి ఒక్కరూ ఆకర్షితులవుతున్నారని పాండు బీజేపీలోకి వెళ్లినా అక్కడ ఇమడలేక రెండు రోజుల్లోనే మళ్లీ సొంత పార్టీలోకి వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు సామంతుల అప్పారావు, నాయకులు జిలానీ, పంపన సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రజల్లో మార్పు తీసుకురావాలి



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పెంటపాడు: విద్యార్థులు ప్రజా ఉపయోగపనుల ద్వారా ప్రజల్లో మార్పు తీసుకురావాలని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ తెలిపారు. ఆకుతీగపాడు గ్రామంలో పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం రెండో రోజు మంగళవారం గ్రామంలో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ దేవత ఆలయం, తాగునీటి చెరువు, రహదారులు శుభ్రం చేశారు. రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న రాయితీలను, ఉపయోగపడుతున్నాయో లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ శిబిరం ద్వారా సేవామార్గాన్ని ఎంచుకొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించాలని విద్యార్థులను కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయబాబు, కమిటీ సభ్యులు సురేంద్రబాబు, రామచంద్రుడు, కళాశాల సిబ్బందితో పాటు, గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న మంత్రి కారుమూరి



కొండాలమ్మ తల్లి ఆలయంలో మంత్రి కారుమూరి, చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావులను సత్కరిస్తున్న సంఘ పెద్దలు

తణుకు అర్బన్: తణుకు కంపోస్టు యార్డు ప్రాంతంలోని కొండాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం నిర్వహించిన హోమం కార్యక్రమాల్లో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. పాతవూరు శ్రీరామా శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న ప్రారంభమైన హోమం, పూజాధికాలు 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ లోకకల్యాణార్థం చేస్తున్న హోమాలు, పూజాధికాలతో తణుకు నియోజకవర్గ ప్రజానీకమంతా కొండాలమ్మ తల్లి ఆశీస్సులతో సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ఆవరణలో మంత్రి కారుమూరిని, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామా శెట్టిబలి సంఘ పెద్దలు సానబోయిన రాములు, పిల్లి ముత్యాలరావు, కుడుపూడి చంద్రరావు, సానబోయిన రామకృష్ణ, సానబోయిన శ్రీను, సానబోయిన దామోదరరావు, కొరు నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు పిల్లి సూరిబాబు, నాయకులు పంపన సుబ్బారావు, గోడి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అండదండలతో ఉన్నతస్థాయికి ఎదిగా

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఆర్యవైశ్యుల అండదండలతోనే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సభను మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉపముఖ్యమంత్రి కొట్టు తొలుత వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమావేశానికి హాజరై మాట్లాడుతూ వ్యాపార రంగం నుంచి వచ్చిన తనకు ఆర్యవైశ్యులతో తరతరాల అనుబంధం ఉందన్నారు. వారితో కలిసిమెలిసి వ్యాపారం చేసిన రోజులను గుర్తు చేసుకొన్నారు. తనకు చిన్నతనం నుంచి చదువుకొనే రోజుల నుంచి ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి ఎంతో మంది స్నేహితులు ఉన్నారన్నారు. తాను గత 30 ఏళ్లుగా రాజకీయాల్లో రాణించడానికి అందరి సహకారంతో పాటు ఆర్యవైశ్యులు సహకారం కూడా కారణమన్నారు. వారి ఆశీస్సులతో తాను డిప్యూటి సీఎంగా ఉన్నత స్థాయికి చేరుకున్నానన్నారు. తాను రాజకీయంగా ఎదిగిన నాటి నుంచి ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత నిస్తూ వచ్చానన్నారు. అదే అనుబంధం ముమ్ముందు కొనసాగాలని ఆకాంక్షించారు. నిండు మనస్సుతో తనను ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని మంత్రి కొట్టు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొర్లేపర రాము, నున్న బాలత్రిపుర సుందర్రావు, కోశాధికారి భోగవిల్లి రమేష్, ఆలయ కార్యదర్శులు ఆలపాటి చిన్న, ఆలపాటి సత్యనారాయణ, పూర్వపు అధ్యక్షుడు పేరూరి కాశయ్య, ఉండా బ్రహ్మాజీ, పార్టీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, చెన్నా జనార్ధనరావు, ముత్యాల ఆంజనేయులు, బొడ్డు సాయిబాబా, జడ్డు హరివాబు, మానికొండ వెంకటేశ్వరరావు, వెల్లిశెట్టి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో అధ్యక్షుడు వంగవండు రామ్మోహన్‌రావు అధ్యక్షతన మెగా ఉచిత వైద్య శిబిరం డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో జరిగింది. దాట్ల లక్ష్మీపతిరాజు ఆర్థిక సాయం అందజేశారు. జనరల్ సర్జన్ నూకల మహీధర్, డాక్టర్ వెంకట అర్జున్, సాయి సిద్ధార్థ ఆస్పత్రి సిబ్బంది సేవలు అందజేశారు. 227 మంది రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు హాజరై 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పదం కుమార్ గుప్తా, మదన్ మోహన్ అగర్వాల్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, చిన్నం జగదీష్, జీడికుంట హరిబాబు, సుంకర శ్రీనివాస్, సన్నిధి సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



ఇరగవరం: ఏలేటిపాడు, అయితంపూడి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం



పెంటపాడు: ప్రత్తిపాడు తూర్పుపేటలో రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఇరగవరం: మండలంలోని ఏలేటిపాడు నుంచి అయితంపూడి వరకు సుమారు మూడు కోట్ల రూపాయాల వ్యయంతో 1 కిలో మీటర్ మేర నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ జెఈ యశ్వంత్ నిర్మాణ పనులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు. జెసీఎస్ కన్వీనర్ దినేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పులూరి జితేంద్ర మాట్లాడుతూ నిడదవోలు నుంచి నర్సాపురం వరకు ఉన్న ఈ రోడ్డు గత ప్రభుత్వంలో నాయకులు పట్టించుకోకపోవడంతో సుమారు 16 గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో ఈ సమస్యను మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. వేంటనే స్పందించిన ఆయన కోటి రూపాయాలు నిధులు మంజూరు చేశారు. పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.

ప్రత్తిపాడులో..

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో ప్రభుత్వం అందజేసిన రూ. 20 లక్షల నిధులతో సుమారు 6 రహదారుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామానికి అందించిన రూ. 20 లక్షల నిధులతో ప్రత్తిపాడు ఎస్సీపేటలో 3 రహదారులు, బీసీ ఏరియాల్లో మరో 3 రహదార్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు 500 మీటర్ల మేర సిమ్మెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయని గ్రామ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ పనులను పంచాయతీరాజ్ ఏఈ ఉన్నమట్ల నవీన్, వర్కు ఇనస్పెక్టర్ చదలవాడ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బద్దిరెడ్డి వెంకటేష్‌లు పర్యవేక్షిస్తున్నారు.

పశు వైద్యులకు సత్కారం

తణుకు టౌన్: మండలంలో పశువైద్యులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన వారిని సిబ్బందిని ఘనంగా సత్కరించారు. మంగళవారం సాయంత్రం బదిలీపై గన్నవరం పశు విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా బదిలీపై వెళ్లిన తణుకు రూరల్ మండలం వేల్పూరు పశువైద్యాధికారి డాక్టర్ కె అశోక్‌రెడ్డి, మండపాక పశువైద్యాధికారిణి డాక్టర్ పీ సుష్మదేవిలను వేల్పూరు పశువైద్యశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులను సిబ్బంది, రైతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పశువైద్యులు శంకర్ భవన్ నారాయణ, అసిస్టెంట్ పశువైద్యులు కే అఖిల్, సచివాలయ సిబ్బంది, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ప.గో.జిల్లా, తణుకు మండలం, కొమరవరం గ్రామము, డి.నెం.1-167, ఇంటి రాపూరావు గారి కుమారుడు సత్య వెంకటేష్ అనునేను 11-03-2024న డ.నెం.6621/2020 గల ఒరిజినల్ దస్తావేజు జెరాక్స్ నిమిత్తం వెళ్ళు చుండగా దారిలో పోగొట్టుకొనితిని. దొరికిన వారు సెల్ నెం.94940 69663కు తెలియజేయగలరు.

సర్పంచ్‌ల ఫొటోలపై ముసుగులు తొలగించాలి



పెంటపాడు ఎంపీడీవో బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న మండల సర్పంచ్‌లు

పెంటపాడు: ఎన్నికల కోడ్ పేరుతో సర్పంచ్‌ల ఫొటోలపై ఆంక్షలు వేయడం తగదని మండల సర్పంచ్‌ల ఛాంబర్ తీర్మానించింది. ఈ సందర్భంగా పెంటపాడు మండల కార్యాలయం వద్ద మంగళవారం మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు మహిళా నాయకురాలు భావన ధాన్యలక్ష్మిల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతులుగా, దేశ రాజ్యాంగం ప్రకారం గ్రామాలకు సేవచేసేందుకు ఎన్నికైన సర్పంచ్‌లను ఎన్నికల కోడ్‌లోకి తీసుకొచ్చి వారి ఫొటోలు ఉన్న ప్రాంతాల్లో ముసుగులు వేయడం సరికాదన్నారు. తక్షణం ఎన్నికల అధికారులు స్పందించి సర్పంచ్‌ల ఫోటోలపై ఉన్న ముసుగులను తొలగించి ప్రజల్లో వారి గౌరవాన్ని కాపాడాలన్నారు. ఎంపీడీవో సీహెచ్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎన్నికల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, దర్శిపర్రు సర్పంచ్ కోలా శేషవేణి, కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య, ఆకుతీగపాడు సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి



గుమ్మంపాడులో టీడీపీ చేసిన అసత్యప్రచారాన్ని ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అత్తిలి: తణుకు నియోజకవర్గం టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేస్తున్న చిల్లర రాజకీయాలు చూసి నియోజకవర్గ ప్రజలు అసహ్యించుకుంటున్నారని అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నేలపాటి సుబ్బయ్య దుయ్యబట్టారు. మంగళవారం గుమ్మంపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుమ్మంపాడు గ్రామానికి గాని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గాని సంబంధంలేని కొంత మంది వ్యక్తులకు టీడీపీలో చేరారని తప్పుడు ప్రచారం చేయటం మానుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ గుమ్మంపాడు గ్రామ అధ్యక్షుడు టీడీపీలో చేరారని సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరుస్తూ, గ్రామ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాని చెప్పారు. దళిత నాయకుడికి చెందిన పదవిని మీచౌకబారు ప్రచారం కోసం వేరొకరికి అంటగట్టి అవమానించడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా ఆరిమిల్లి రాధాకృష్ణ తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. రాధాకృష్ణకు తణుకు నియోజకవర్గంలో ఆదరణ కరువైందని అందుకే ఇలాంటి తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీకి చెందిన ఒక కార్యకర్త తప్ప మిగిలిన ఎవరికి గ్రామంతో సంబంధం లేదని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, ఉపసర్పంచ్ రావూరి వెంకన్నబాబు, బూత్ కన్వీనర్లు యాళ్ల సాధు సుందర్‌సింగ్, ఉన్నమట్ల శ్రీనివాస్, పెచ్చెట్టి రాము, యర్రంశెట్టి రమేష్, ఆరెపల్లి వాసు, బడేటి బాబ్జి, కనకారావు, బుంగా సంజీవరావు, కలిగపూడి పెద్ద కనకయ్య, బద్దా సుధీర్, ఇందుకుని వెంకటరాజు, పెచ్చెట్టి సుబ్బారావు, నడింపల్లి సుబ్బరాజు, ఏలూరి సాల్మన్‌రాజు, బడేటి లక్ష్మణరావు, ఇట్టా కేదారి, బుంగా వెంకట్రావు, యాళ్ల మనోహర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918
తణుకు: 90108 43311, 90100 51493

Office mail : tpgadvt@gmail.com